సమాచారాన్ని గోప్యంగా ఉంచుతాం

ఆధార్ కార్డు తప్పనిసరి కాదు: మంత్రి పొన్నం

మిథిలానగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

సిటీబ్యూరో, నవంబరు 14(నమస్తే తెలంగాణ)/బంజారాహిల్స్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జీహెచ్ఎంసీ మేయర్ జీవీ లక్ష్మి, అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీశ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్‌లోని రోషన్ బాగ్ కాలనీ అపార్ట్‌మెంట్స్, నాజర్ మిథాలీ నగర్‌లో ఇంటింటి కుటుంబ సర్వే తీరును పరిశీలించారు. ప్రజల స్థితిగతులు తెలుసుకునేందుకు, భవిష్యత్ ప్రభుత్వ ప్రణాళిక ద్వారా మంచి మార్పు తీసుకు వచ్చే దిశగా, ప్రజలను భాగస్వాములను చేసుకుని ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జరుగుతుందని పొన్నం తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు అనుమానాలు పెట్టుకోవద్దని, సమాచారం గోప్యంగా ఉంటుందని, సర్వేతో ఎవరికీ కూడా ప్రభుత్వ పథకాలు కట్ కావని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆధార్ కార్డు తప్పనిసరి కాదన్నారు. ఎవరికేనీ ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఉన్నట్లయితే జిల్లా కలెక్టర్లు, స్పెషల్ నోడల్ పర్యవేక్షణ అధికారులు నివృత్తి చేస్తారని తెలిపారు.

5,90,171 కుటుంబాల్లో సర్వే పూర్తి

ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే కొనసాగుతున్నది. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఆరు రోజుల వ్యవధిలో 5,90,171 కుటుంబాలు సర్వే పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గురువారం ఒక్క రోజే 1,45,896 కుటుంబాల్లో సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఈ సర్వేలో 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించి, 10 బ్లాక్‌లకు ఒక సూపర్‌వైజర్‌లను నియమించినట్లు చెప్పారు. సర్వేలో తప్పులు లేకుండా, సమర్థవంత నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక మానిటరింగ్ అధికారులను నియమించిందని అధికారులు తెలిపారు. సర్వే ఫారాలను ర్యాండమ్ చెక్ చేసి తప్పులు లేకుండా అందులో అంశాలను సరిగా కోడింగ్ చేశారో.. లేదో.. పరిశీలన చేయాలని చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్యూమరేటర్లు అటెండెన్స్‌పై దృష్టి పెట్టాలని, రిపోర్టుతో పాటు సర్కిల్ లెవల్ సర్వే ఫారాలను భద్రపరిచే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సర్కిల్ లెవల్‌లో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసి ఎంపిక చేసిన ఏజెన్సీ ద్వారా ఎంట్రీ ప్రక్రియను స్టార్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ వ్యాప్తంగా కుటుంబ సర్వే ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పర్యవేక్షణ అధికారులకు సూచించారు.

సాగు అనుబంధాలపైనే అధిక ఉపాధి

ఐటీ అగ్రిబిజినెస్ హెడ్ డా.శివ కుమార్

మాట్లాడుతున్న ఐటీ అగ్రి బిజినెస్ హెడ్ డా. శివ కుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 14: దేశంలో ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయని, అందుకు వాతావరణ పరిస్థితులతో పాటు రైతు కుటుంబాలలో యువత ఆయా రంగాలలో ఆసక్తి చూపుతున్నారని ఐటీ, అగ్రి బిజినెస్ సంస్థ హెడ్ డా.శివ కుమార్ సూచించారు. నార్మ్‌లో మూడు రోజులుగా సుస్థిర వ్యవసాయంపై జరుగుతున్న సదస్సు గురువారం ముగిసింది. ఐటీ, అగ్రిబిజినెస్ సంస్థ హెడ్ డా.శివ కుమార్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాల వనరులనే యువత ఉపాధిగా మలుచుకుంటూ, తమతో పాటు మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ విద్య, ఉపాధిలలో యువత ప్రాధాన్యత పెరిగింది. వారి ఆలోచనల ఫలితం ఎలక్ట్రిక్ వాహనాలు, రిమోట్ యంత్రాలు, కూరగాయలు, పండ్ల తోటలు, పాల ఉత్పత్తులు ప్రత్యక్ష, పరోక్షంగా నూతన మార్పులు తీసుకు వస్తున్నారు. రైతులకు లాభదాయక సౌర కుటీరం, చిరు ధాన్యాలతో రుచికరమైన తినుబండారాలు తదితర రంగాలలో ఉపాధి పొందవచ్చన్నారు. మన వద్ద వాతావరణ పరిస్థితులు, నేలలు అనుకూలంగా ఉన్నా రైతాంగంలో మార్పు అవసరమన్నారు. నార్మ్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ ఆహార భద్రత పట్ల శాస్త్రవేత్తలు పరిస్థితులకు అనుగుణంగా మరిన్ని వంగడాలను కనుగొనడం, రైతులను చైతన్యం చేయడం, వ్యవసాయ అనుబంధ రంగాలపైనే మరింత దృష్టి పెట్టడం అవసరమన్నారు. సదస్సులో 50కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు.

రెసోనెన్స్ వార్షిక వేడుక

రెసోనెన్స్ కళాశాల వార్షిక వేడుకను గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో 'రెసోఫెస్ట్' పేరిట గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బొల్లంట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు బొల్లా శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. *– శేరిలింగంపల్లి, నవంబర్ 14*

వైఎంసీఏలో వందేండ్ల ఒలింపిక్ మూమెంట్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వైఎంసీఏలో ఒలింపిక్ మూమెంట్‌కు 100 ఏండ్లు నిండాయి. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ వైఎంసీఏలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ అనిల్ థామస్ జీని గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నార్మన్ ఇసాక్, లియోనార్డ్ మైరాన్, సంపత్, కెన్నత్, ఎగ్యున్ జార్జ్ పాల్గొన్నారు.

పేట్ బషీరాబాద్‌లోని సర్వే నం.25/2లో ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాన్ని జూన్ 28న పోలీసుల సహకారంతో కూల్చివేస్తున్న దృశ్యం(ఫైల్)

అధికారం మనదైతే.. అడ్డేముంది?

- కూల్చిన చోటే.. పునర్నిర్మాణం
- ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు!
- సర్వే నం.25/1, 25/2లో దర్జాగా స్థలాలు కబ్జా
- అధికార నేత అండదండలతో ఇటీవల బహుళ అంతస్తులు?
- ప్రేక్షక పాత్రలో అధికార యంత్రాంగం
- పేట్ బషీరాబాద్‌లో ప్రభుత్వ స్థలానికి రక్షణ కరువు

"అధికారం మనదైతే.. ఆపెదెవడు? మనకింకా అడ్డేముంది? మనం ఆడిందే.. ఆట, పాడిందే పాట అన్న ధోరణి కాంగ్రెస్ పార్టీ నేతలది. ప్రభుత్వ స్థలాలను అధికార పార్టీ నేతలు అధికార యంత్రాంగంతో జోడీ కట్టి ఇష్టారాజ్యంగా ఆక్రమిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లంటూ ఏండ్ల తరబడి కలలు కని, కష్టపడి నిర్మించుకున్న ఇండ్ల కూలగొడుతూ ప్రజలను పీడిస్తున్నారు. అదే తమ పార్టీకీ చెందిన నేతలు అడ్డూ అదుపు లేకుండా నిర్మాణాలను చేపడితే మాత్రం పాలనా యంత్రాంగం పట్టించుకున్న పాపాన పోదు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, నిర్మాణాలు చేపడితే, ఇది తప్పుడు వ్యవహారం అని కూల్చినా.. తిరిగి నిర్మించడం అధికార పార్టీ నేతలకే చెల్లుతుంది. ఇదీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పాలన తీరు. ప్రజా పాలన అంటే.. ఇదే కాబోలు?"

సర్వే నం. 25/2 ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా వెలిసిన నిర్మాణం, నర్సరీలో వెలసిన అక్రమ నిర్మాణం (ప్రస్తుతం)

కుత్బుల్లాపూర్, నవంబర్ 14: ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతుంది. అధికార పార్టీకి చెందిన బడా నేతల అండదండలతో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు యథేచ్ఛగా పూర్తయ్యాయి. గతంలో అధికార యంత్రాంగం అక్రమ నిర్మాణాల్ని కూల్చివేస్తే, అధికార పార్టీ నేతల అండదండలతో తిరిగి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పేట్ బషీరాబాద్ సర్వే నం.25/1, 25/2లలో పూర్తిగా ప్రభుత్వానికి సంబంధించిన స్థలం ఉంది. దీని పరిరక్షణ హెచ్ఎండీఏ ఆధీనంలో ఉండగా, గత కొంతకాలంగా అక్కడ కొంత మంది వ్యక్తులు ఎన్‌హెచ్-44 జాతీయ రహదారికి సమీపంలో ఓ నర్సరీని ఏర్పాటు చేసుకున్నారు. అధికారులు అటు వైపు వెళ్లితే వారికి కామారెడ్డి జిల్లాకు చెందిన అధికార పార్టీ కీలక నేత కింద పని చేసే కొంత మంది వ్యక్తులు శాఖ పరమైన చర్యలకు అడ్డు కట్ట వేయిస్తున్నారు. మరో వైపు నిజాం వారసత్వం నుంచి తమకు సంక్రమించాయంటూ తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారు. ఇది కుత్బుల్లాపూర్ మండలం పేట్ బషీరాబాద్‌లో సర్వే నం.25/1, 25/2లలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాల బాగోతం.

నర్సరీ పేరిట ప్రభుత్వ స్థలంలో పాగా..

పేట్ బషీరాబాద్‌లోని సర్వే నం. 25/2, 25/1లో ప్రైవేట్ వ్యక్తులు గత కొంత కాలంగా నర్సరీని ఏర్పాటు చేసుకున్నారు. రోజులు గడిచే కొద్ది నర్సరీని కాస్త ఫాంహౌజ్‌గా మార్చుకొని అక్కడే మకాం వేసి, ఇటీవల కాలంలో ఏకంగా ఇంటి నిర్మాణాలు చేపట్టుకున్నారు. సర్వే నంబర్‌లో వెలిసిన నిర్మాణాలపై ఇదే ఏడాది జూన్ 28న కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు పేట్ బషీరాబాద్ పోలీసుల సహకారంతో కూల్చివేశారు. దానికి సమీపంలోనే సర్వే నం.25/2 లో ఉన్న మరో అక్రమ బహుళ నిర్మాణాన్ని కూల్చేందుకు అధికారులు అటు వైపునకు కన్నెత్తి కూడా చూడలేదు.

అధికార పార్టీ నేత అండతో...

కామారెడ్డి జిల్లాకు చెందిన అధికార పార్టీ నేత అనుచరులతో స్థానికంగా ఉండే అధికారులకు ఫోన్లు చేయించి అటు వైపునకు వెళ్లకుండా అడ్డుకట్ట వేసుకున్నాడు. దీనిపై సంబంధిత రెవెన్యూ అధికారుల వివరణ కోరగా, స్పష్టత ఇచ్చేందుకు వెనకడుగు వేయడం గమనార్హం. ఒకవైపు ప్రభుత్వ స్థలాలపై హైడ్రా చర్యలు తీసుకుంటున్న తరుణంలో.. మరో వైపు అధికార పార్టీకి చెందిన బడా నేతల అండదండలతో కోట్ల విలువ చేసే స్థలాలు మాయం కావడం పట్ల తీవ్ర విమర్శలకు తావిస్తుంది. దీనిపై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలంటూ స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షిస్తాం

పైన పేర్కొన్న సర్వే నంబర్‌లో గతంలో నిర్మాణాలు చేపడితే కూల్చివేయడం జరిగింది. అయినా, తిరిగి నిర్మాణాలు చేపట్టడం ప్రభుత్వ వ్యతిరేక చర్య. ప్రభుత్వ స్థలంలో వెలిసిన నిర్మాణాలను అధికారికంగా కూల్చివేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటాం. నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్ రెహమాన్ ఖాన్, తహసీల్దార్, కుత్బుల్లాపూర్

పది నెలల్లో రూ.35 వేల కోట్ల పెట్టుబడులు

- 51 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తాం
- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మాదాపూర్, నవంబర్ 14: పది నెలల్లో రూ.35 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 51 వేల మందికి ఉద్యోగావకాశాలు అందిస్తామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన లైఫ్ సైన్సెస్ సెక్టార్ అచీవ్‌మెంట్ వార్షిక వేడుకలు నిర్వహించారు. ఇందుకు మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి నిర్వాహకులతో జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడి ఇంకా ఏడాది పూర్తి కాకుండానే లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో భారీ పెట్టుబడులను ఆకర్షించి అద్భుత విజయాలను సాధించినట్లు తెలిపారు. పది నెలల్లో రూ. 35.820 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. 141 దేశీయ, బహుళ జాతి కంపెనీలు ఔషధ, టీకాలు, లైఫ్ సైన్సెస్, పరిశోధన రంగాల్లో నిర్మాణాలు మొదలు పెట్టడం పూర్తి చేసుకొని ఉత్పాదన మొదలు పెట్టే దశల్లో ఉన్నాయని చెప్పారు. విస్తరణ పనులు చేపట్టిన కంపెనీలు ఉత్పాదన ప్రారంభించినట్లు తెలిపారు. చేపట్టిన ప్రాజెక్టులు అన్ని పూర్తయితే 51,086 మందికి ఉద్యోగాలు దొరకనున్నట్లు తెలిపారు. దేశంలో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో కొత్త కంపెనీలకు హైదరాబాద్ కేంద్ర బిందువు అయినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒకే చోట కాకుండా పలు ప్రాంతాల్లో ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఏషియాలోనే మూడో అతి పెద్ద జపాన్‌కు చెందిన టకెడా లైఫ్ సైన్సెస్ సంస్థానిక బయోలాజికల్‌తో కలిసి ఏటా రూ.5 కోట్ల డెంగీ వ్యాక్సిన్లను ఉత్పత్తి చేసి ప్రపంచ వ్యాప్తంగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ పాలసీ ప్రకటన వచ్చే రెండు నెలల్లో లైఫ్ సైన్సెస్ కంపెనీలు నెలకోల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు భూ కేటాయింపులు, ప్రోత్సాహకాలకు సంబంధించిన విధాన ప్రకటన సీఎం చేయనున్నట్లు తెలిపారు.

17న రెడ్‌క్రాస్ మెగా హెల్త్ క్యాంప్

జూబ్లీహిల్స్, నవంబర్ 14: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మాసబ్ ట్యాంక్‌లోని రెడ్‌క్రాస్ భవన్‌లో ఈ నెల 17న ఉచిత మెగా మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఐఆర్‌సీఎస్ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డెంటల్, ఐ, ఈఎన్‌టీ, ఫిజియోథెరపీ, ఆర్‌బీఎస్/బీపీ, కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, ఈసీజీ/2డీ ఎకో/బీఎమ్‌డీ, ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్న ఈ వైద్య శిబిరాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే వారు మధ్యాహ్నం 12 గంటలలోపు తమ పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

అవగాహన సదస్సు ఫిట్‌నెస్ సెషన్‌లో చిన్నారులు

124.9 మిలియన్ల మధుమేహులు@2045

ఖైరతాబాద్, నవంబర్ 14: ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ నివేదిక ప్రకారం, ప్రపంచంలో 2045 నాటికి 124.9 మిలియన్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులుగా మారుతారని వైద్యులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా నిమ్స్ దవాఖానలోని ఆడిటోరియంలో రీసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబెటిస్ ఇండియా తెలంగాణ చాప్టర్, ఎండోక్రైనాలజీ విభాగం సంయుక్తాధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సును ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డైరెక్టర్ డా.నగరి బీరప్పతో కలిసి ప్రారంభించారు. కర్ణన్ మాట్లాడుతూ మధుమేహం వయస్సుతో సంబంధం లేకుండా వస్తోందని, పెద్దలతో పాటు చిన్నారులు సైతం ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ప్రస్తుతం, ప్రపంచ జనాభాలో 10.5 శాతం మంది ప్ర జలు మధుమేహంతో బాధపడుతున్నారని, సాలిన 2,29,400 మంది చిన్నారులు టైప్-1 డయాబెటిస్‌తో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆహార నియమాలు పాటించి, వ్యాయామం చేస్తే ఈ వ్యాధికి దూరంగా ఉండవచ్చన్నారు. పిల్లలకు వచ్చే టైప్-1 డయాబెటిస్‌కు ఇన్సులిన్ క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఇన్సులిన్ పంపులను అందజేస్తుందన్నారు.

రేపు దర్శనమ్ ద్విదశాబ్ది మహోత్సవం

సిటీబ్యూరో, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): నాంపల్లిలోని పబ్లిక్ గార్డెన్‌లో శనివారం దర్శనమ్ ద్విదశాబ్ది మహోత్సవం జరగనుందని నిర్వాహకులు గురువారం పేర్కొన్నారు. మైసూర్ అవధూత దత్త పీఠాధీశ్వరులు గణపతి సచ్చిదానంద స్వామి వారికి గురు వందనమ్ ఈ నెల 16న జరగనుందన్నారు. కార్యక్రమానికి వివిధ దేశాల ధార్మిక, ఆధ్యాత్మిక వేత్తలు, ప్రముఖులు పాల్గొంటారన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆటో, క్యాబ్ మోటర్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ రంగారెడ్డి జిల్లా యూనియన్

ఆరాంఘర్‌లో ఆటో డ్రైవర్లతో ఏఐటీయూసీ ధర్నా

మాట్లాడుతున్న ఆటో జేఏసీ నేత వెంకటేశం

మైలార్‌దేవపల్లి, నవంబర్ 14: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ మోటర్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చందు యాదవ్‌లు డిమాండ్ చేశారు. ఆరాంఘర్ చౌరస్తాలో గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్షులు నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చందు యాదవ్‌లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం కింద ఫ్రీ బస్సులు ఏర్పాటు చేయడంతో డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో తెలిపినట్లు ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వమే ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా ఆటో డ్రైవర్లు ప్రమాదంలో చనిపోతే రూ.ఆరు లక్షలు అందే విధంగా, సాధారణ మరణమైతే రూ.1.30 లక్షలు ఇవ్వాలన్నారు. 50 ఏండ్లు దాటిన ఆటో డ్రైవర్లలో ప్రతి ఒక్కరికి ఐదు వేల ఫించన్ ఇవ్వాలన్నారు. ఆటోలకు ప్రభుత్వమే ఫ్రీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా యాక్సిడెంటల్ బీమా రూ.10 లక్షల వరకు పెంచాలన్నారు.

ప్రభుత్వం ఉదాసీన వైఖరి తగదు: ఆటో జేఏసీ

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబించడం తగదని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ నేతలు బి.వెంకటేశం, కె.అజయ్‌బాబు, ఏ.సత్తిరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో గురువారం జేఏసీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లకు గిరాకీలు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. ఆటో డ్రైవర్లు పేదరికంలో మగ్గుతున్నారని, ఇంటి అద్దెలు, ఆటో కిరాయిలు కట్టలేక కొంత మంది ఆటో డ్రైవర్లు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

కౌండిన్య మహర్షి జయంతిని అధికారికం చేయాలి

- ప్రభుత్వానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

'గౌడ కుల దైవాల చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 14: గౌడ కుల మూల పురుషుడు కౌండిన్య మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున కౌండిన్య మహర్షి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్ ఆధ్వర్యంలో కౌండిన్య మహర్షి జయంతి జాతీయ వారోత్సవాలను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించగా, ముఖ్య అతిథిగా శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రకృతిని పూజించే సంస్కృతి ఉందన్నారు. ప్రకృతితో పాటు మానవ, వృక్ష, జంతు జాతులను సంరక్షించిన గొప్ప మహానుభావుడు కౌండిన్య మహర్షి అని కొనియాడారు. ఆయన పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో ఆశ్రమం, వన్యప్రాణి సంరక్షణ కేంద్రం ఉన్నాయని చెప్పారు. ఆయన వారసులుగా ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా కౌండిన్య వారసులు పర్యావరణ రక్షణకై, ప్రజారక్షణకై నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. ఆయన జయంతి వారోత్సవాలను ఓయూలో నిర్వహించడం గర్వంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాలకు కేంద్ర బిందువుగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల వేదికగా ఈ ఉత్సవాలను నిర్వహించాలనే భావనతో ఇక్కడే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆయన కృషి, త్యాగాలను ప్రజలకు తెలియజెప్పాలని కోరారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎంతో ఉన్నతమైన గీత వృత్తిని హీనంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో నీరాను మార్కెట్లోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. అనంతరం, వట్టికూటి రామారావు గౌడ్ రచించిన 'గౌడ కులదైవాల చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జై గౌడ్ ఉద్యమ నాయకులు మాదు సత్యం గౌడ్, గుండ్రాతి నారాయణ గౌడ్, బండి సాయన్న గౌడ్, సూదగాని హరిశంకర్ గౌడ్, బాలగోని బాలరాజు గౌడ్, డాక్టర్ ఆనంద్, ఐలి వెంకన్న గౌడ్, అంబాల నారాయ ణ గౌడ్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, వేములయ్య గౌడ్, సాంబశివ గౌడ్, రాము గౌడ్, డా.మహేందర్ గౌడ్, ఆర్.మురళీ గౌడ్, వెంకటస్వామి గౌడ్, తిరుపతి గౌడ్, నరేందర్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, రాజేశ్ గౌడ్, వెంకటరమణ గౌడ్, భాను గౌడ్, బి.శంకర్ గౌడ్, శివరాం గౌడ్, పి.నాగరాజు గౌడ్, అనూరాధ గౌడ్, లింగం గౌడ్, రాజశేఖర్ గౌడ్, విక్రమ్ గౌడ్, రవీందర్ గౌడ్, వెంకటన్న గౌడ్, కె.వినయ్ గౌడ్, మహేశ్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, రమేశ్ గౌడ్, సందీప్ గౌడ్ పాల్గొన్నారు.

పట్టించుకోకపోతే ఉద్యమం తీవ్రతరం: ఉద్యోగులు

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

బంజారాహిల్స్, నవంబర్ 14: డాక్టరర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్ఏఎఫ్ఏయూకు కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు 56వ రోజుకు చేరుకున్నాయి. ఉద్యోగులంతా నిరసన కార్యక్రమాలు చేస్త